




## *మొగుడిచ్చే డబ్బుకాదు - మనసిచ్చే మొగుడు కావాలి!*

**మనిషి జీవితంలో ఆడవాళ్ళకైనా** మగవాళ్ళకైనా పెళ్ళి ఓ మహత్తరమైన మలుపు.

'పెళ్ళంటే మూడు ముళ్ళుకాదు, నూరేళ్ళ పంట' అన్నారు పెద్దలు.

'పెళ్ళి చేసుకుని ఇల్లు చూసుకుని చల్లగా కాలం గడపాలోయ్ మీరెల్లరు హాయిగా వుండాలోయ్' అని అప్పుడెప్పుడో ఓ సీనియర్ కవిగారి సినిమా పాటలో పల్లవించారు. నిజమే.

ప్రతి మనిషి జీవితంలోనూ పెళ్ళి అనేది ఓ గొప్ప థ్రిల్లు. పెళ్ళిపీటలపై కూర్చున్న దంపతుల కళ్ళల్లో అద్భుతమైన మెరుపేదో కనిపిస్తుంది. భర్త తన మెడలో తాళి కడుతూంటే భార్య పులకించిపోతుంది. మెరిసిపోయే ఆవిడగారికి కళ్ళల్లోకి ఆనందభాష్పాలు కూడా ఉబికి వస్తాయి. తన జీవితానికి ఓ గౌరవం, ఓ పెద్దరికం, ఓ పరిపూర్ణత ఇత్యాదులన్నీ వచ్చినట్టు గర్వంతో పొంగిపోతుంది. అసలు ఆడపిల్లకి పెళ్ళి కాగానే నూటికి డెబ్బై అయిదు మార్కులు సిద్ధించినట్టవుతుందని ఈ మధ్య ఓ సినిమాలో కూడా శలవిచ్చారు. అలాగే, శోభనం గదిలోకి మొదటి రాత్రి వెండి గ్లాసుతో పాలు తీసుకొచ్చే భార్యను చూసిన భర్తగారి మనసు నిండా మధురమైన అనుభూతి నిండిపోతుంది.

పెళ్ళయ్యాక కొద్దిరోజులపాటు భర్త తన ఉద్యోగానికి శలవు పెట్టేస్తాడు. భార్యామణి కూడా ఉద్యోగస్తురాలైతే ఆమె చేత కూడా శలవు పెటిస్తాడు. ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో రెండు బెర్తులుండే కూపేలో రిజర్వేషన్ చేయించుకుని హనీమూన్ పేరుతో హాయిగా తిరుగుతారు.

దార్లో ఎక్కడైనా భార్య అరికాల్లో ముల్లు గుచ్చుకుంటే రక్తం రాకపోయినా సరే స్పెషలిస్టు దగ్గరకు తీసుకెళ్ళి టెటనస్ ఇంజక్షన్ ఇప్పించి డ్రస్సింగ్ చేయిస్తాడు భర్త. మంచం దిగద్దని మందలిస్తాడు. మాటిమాటికి 'ఇప్పుడెలా వుంది?' అని ప్రశ్నల వర్షం కురిపిస్తాడు.

"ఆ దేవుడెంత నిర్దయుడు? ఆ గుచ్చుకునే ముల్లేదో నీ లేత తమలపాకులాంటి అరికాలికే గుచ్చుకునేలా చేయాలా? నాకు గుచ్చుకోకూడదూ?" అంటూ భార్య ఒడిలో తలపెట్టుకుని కన్నీరు కూడా పెట్టుకుంటాడు.

తన పట్ల భర్తకున్న ప్రేమానురాగాలకు ఆమె కరిగిపోయి అతని కౌగిట్లో ముద్దయిపోతుంది.

"అయ్యో! ఈ మాత్రానికే అంత బాధపడతారెందుకండీ?" అంటూ తన చీర చెంగుతో అతని కన్నీళ్ళు తుడుస్తుంది.

కానీ ఇలా ఎంతకాలం సాగుతుందంటారు?

కొద్దివారాలు, కాకపోతే మరికొద్ది నెలలు, అంతే! ఆ తర్వాత వారిద్దరిమధ్యా ఇదే పద్ధతిలో డైలాగులు కొనసాగవు. కొనసాగితే అది జీవితం కాదు.

రోజులు గడుస్తున్న కొద్దీ జీవితంలో మార్పులొస్తాయి. దిన చర్యల్లో మార్పులొస్తాయి. ఆఖరికి పిలుపుల్లో కూడా తేడాలొస్తాయి.

'ప్రేయసీ! డియర్' లాంటి సంబోధనల స్థానంలో 'ఏమేవ్.. ఒసే' అనే పిలుపులు చోటు చేసుకుంటాయి.

పెళ్ళయిన తొలిరోజుల్లో భార్య కాలిలో ముల్లు గుచ్చుకుంటేనే అల్లాడిపోయిన మొగుడు ఆ తర్వాతెప్పుడో -

"ఏవండీ కూర తరుగుతూంటే వేలు తెగిందండీ" అని భార్య రక్తం ఓడుతున్న వేలితో ముందుకు వస్తే -

చదువుతున్న పేపర్లోంచి దృష్టిని కూడా మరల్చకుండా -

"తెగింది వేలేకదా! కాలు తెగినంత ఖంగారు పెడతావేమిటి? కాస్తంత కాఫీ పొడుం అద్దుకో.. రక్తం కట్టేస్తుంది" అంటాడు భర్త. ఏతావాతా చెప్పొచ్చేదేమిటంటే -

'పెళ్ళంటే ఓ మహత్తరమైన మలుపు, పెళ్ళంటే మూడు ముళ్ళుకాదు, నూరేళ్ళ పంట' వంటి స్లోగన్స్‌లో పూర్తి యదార్థం వుండదుగాక వుండదని. అవన్నీ పెళ్ళికి ముందు, అబ్బాయిల్నీ, అమ్మాయిల్నీ పడగొట్టే బంధాలు.

పెళ్ళి చేసుకుని ఇల్లు చూసుకుని ఎల్లకాలం చల్లగ కాపురం చేద్దామనుకుంటే అది సాధ్యపడే విషయం కాదు.

ముఖ్యంగా సినీతారల విషయంలో, నూటికి తొంభై మంది విషయంలో వంటిమీదకు వచ్చిపడే వయస్సుని కూడా 'మేకప్' వెనకాల దాచేసుకుంటూ - పెళ్ళి ప్రస్తావన తెస్తే దాటేసుకుంటూ దీపం వుండగా ఇల్లు చక్కపెట్టుకోవాలన్నట్టుగా గ్లామర్ వుండగా వేషాలు లెఖ్ఖ పెట్టుకుంటారు చాలామంది హీరోయిన్లు.

తమిళ చిత్రరంగంలో తొలి అడుగువేసి, మళయాళంలో మరో అడుగు ముందుకు నడిచి తెలుగు సినీపరిశ్రమలో స్థిరపడిన 'కాంతి' కూడా సరిగ్గా అలాగే అనుకుంది.

తల్లితండ్రులు - పెళ్ళిచేసుకొమ్మని సంబంధాలు తెచ్చి ఒత్తిడి చేస్తే వద్దని వారిస్తూ వాయిదాలు వేసింది. తన జీవితం మీద పెళ్ళి అనే ముద్రపడితే సినిమా ఛాన్సులు తగ్గిపోతాయని భావించింది.

"నిర్మాతలయినా, దర్శకులయినా పెళ్ళికాని హీరోయిన్లకే అవకాశాలు ఇస్తుంటారు. అలాంటి వాళ్ళనే కోరుకుంటారు" అనేది కాంతి అనుభవపూర్వకంగా తెలుసుకున్న నిజం.

కాంతి ఒకప్పుడు అంటే సుమారు ఇరవై సంవత్సరాల క్రితం చాలా అందంగా వుండేది. పాలరాతి శిల్పంలా మెరిసిపోయే సౌందర్యంతో చూపరుల్ని కట్టిపారేసేది. శృంగార కవుల ముందు ఆమెను నిలబెడితే ఆమె సౌందర్యం వాళ్ళచేత ప్రబంధాలను రాయించగలిగేది.

తిరువేండ్రం కాలేజీలో చదువుకునే రోజుల్లో ప్రతి ఏడూ కాంతినే కాలేజీ బ్యూటీగా ఎన్నుకునేవారు. ఓ స్వచ్ఛంద సంస్థవారు నిర్వహించిన అందాల పోటీలో కూడా ఆమె బహుమతి పొందింది. కాలేజీ వార్షికోత్సవాల సందర్భంగా ఏర్పాటైన సాంస్కృతిక కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొనటానికి వచ్చిన ప్రముఖ తమిళ సినిమా దర్శకుని దృష్టిని కాంతి అందచందాలు అతుక్కుపోయాయి.

"పిక్చర్‌లో యాక్ట్ చేస్తావా?" అని అడిగాడు.

"మా పేరెంట్స్‌ని అడగాలి" అని చెప్పింది.

మర్నాడు పొద్దున్నే ఆ దర్శకుడు కాంతి పేరెంట్స్‌ని కలుసుకున్నాడు. తాను తీస్తున్న సినిమాలో ఓ ముఖ్య వేషానికి కాంతిని తీసుకోదల్చుకున్నట్టు చెప్పాడు.

కాంతి తల్లిదండ్రులు ఆలోచనలో పడ్డారు. మరికొద్ది నెలల్లో ఫైనల్ పరిక్ష రాయగానే ఆమెకు పెళ్ళిచేయాలన్న సంకల్పంతో సంబంధాలు కూడా చూస్తున్నారు. ఆ విషయాన్నే దర్శకుడికి చెప్పారు.

"అప్పుడే పెళ్ళికి తొందరేమిటండీ? ఇంకా చిన్న పిల్ల. ఇప్పుడు పిక్చర్‌లో ఈ వేషం చేస్తే కాంతికి మంచి పేరొస్తుంది. బోలెడన్ని ఆఫర్స్ కూడా రావచ్చు. నాలుగైదేళ్ళలో పేరూ డబ్బూ కూడా సంపాదించుకోవచ్చు. అప్పుడు గొప్ప గొప్ప వాళ్ళే మీ అమ్మాయిని చేసుకుంటామని మీ వీధి గుమ్మంలోకి వచ్చి క్యూలో నిలబడతారు" అంటూ నచ్చచెప్పాడు దర్శకుడు.

షూటింగ్ అయినంతకాలం తాము కూడా తమ కూతురుతోనే వుండే షరతు మీద వాళ్ళు అంగీకరించారు.

ఆ విధంగా 1975లో తొలిసారిగా వెండితెరకు తన కాంతుల్ని పంచిపెట్టింది కాంతి.

ఆమె నటించిన తొలి చిత్రం విజయవంతమైంది. ఆమె ఎన్నో సినిమా పత్రికలకు ముఖచిత్ర సుందరైంది. కొన్ని ప్రముఖ పత్రికల్లో ఆమెను ఇంటర్వ్యూ చేయటం కూడా జరిగింది. తమిళంతోపాటు అటు మళయాళంలోనూ ఇటు తెలుగులోనూ కూడా ఆమెకు ఆఫర్లొచ్చాయి. ఓ ఏడాదిపాటు ఆమెతో ఆమె తల్లి కూడా షూటింగులకు వెడుతూండేది. ఆ తర్వాత తల్లికి అనారోగ్యం చేయటంతో కాంతి ఒక్కత్తే షూటింగులకు హాజరయ్యేది.

'ఒంటరిగా ఉన్నావంటే వంటికి మంచిదికాదు' అన్నారు కదా! అది ఆమె పట్ల నిజమైంది.

షూటింగ్ అయిపోయాక ఆమెను కలుసుకునేందుకు ఆయా చిత్రనిర్మాతలూ దర్శకులూ హోటల్ రూమ్‌కి వచ్చేవారు. ఆమెతో సరదాగా కాలక్షేపం చేసేవారు. ఆమె భవిష్యత్తు మీద ఎన్నో ఆశలు కల్పించేవారు. ఆ పైన తమ కోరికను వ్యక్తం చేసేవారు.

"ఒక్కసారి వాళ్ళ కోరిక తీరిస్తే ఎన్నో మెట్లు మనం పైకి వెళ్ళచ్చు" అనే ఆలోచన ఆమెను బలహీన పరిచింది. అంతే.

ఆ ఆలోచన కలిగిన కొంత కాలానికే తెరమీద ఎలాంటి పాత్రలు పోషించినా ఖరీదైన హోటల్ గదుల్లో ఆమె శృంగార నాయికగా మారిపోయింది. డబ్బూ పేరు వచ్చేసరికి తనను కోరుకున్న వారితోగాక తను కోరుకునే వాళ్ళతో జీవితాన్ని ఎంజాయ్ చేయటం నేర్చుకుంది కాంతి.

కేవలం ఏడెనిమిదేళ్ళ వ్యవధిలో సినీతారగా మంచి పేరు తెచ్చుకుంది. ఆర్థికంగా అంతో ఇంతో వెనకేసుకుంది. అమ్మకీ, నాన్నకీ తిరువేంద్రంలో ఇల్లు కట్టించింది. తన కోసం మెడ్రాస్‌లో మరో ఇల్లు కొనుక్కుంది.

అప్పటికి పాతికేళ్ళ వయసు దాటిపోయింది.

జీవితంలో శృంగారాన్ని అనుభవించటం వేరు. దాంపత్య జీవితాన్ని ఎంజాయ్ చేయటం వేరు.

దాంపత్య జీవితాన్ని కొనసాగించటంలో ఓ పరిపూర్ణత వుంటుంది. తన భర్త, తన పిల్లలు, తన ఇల్లు - అలా అనుకోవటంలో ఓ అద్భుతమైన అనుభూతి వుంటుంది.

అందుకే ఓసారి అమ్మానాన్న పెళ్ళి ప్రస్తావన తెస్తే "మీ ఇష్టం" అంది కాంతి.

ఆమెకు ఇష్టమైన వరుడితోనే పెళ్ళి జరిపించారు తల్లితండ్రులు.

అబ్బాయి పేరు ఆనందన్, ఆరడుగుల అందగాడు. మదరాస్ కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం చేసుకుంటున్నాడు.

"నీ సినీమాలు చాలా చూశాను. నీ నటనంటే నాకు చాలా ఇష్టం" అన్నాడు ఆనందన్ తొలిరాత్రి తన కౌగిట్లో చేరిన కాంతితో.

"థాంక్స్" అంది కాంతి అతని గుండెల్లో ఒదిగిపోతూ. "నీ నటన తెరమీద వరకే పరిమితమై వుండాలి. జీవితంలో మాత్రం నటించకూడదు. ముఖ్యంగా నా దగ్గర" అన్నాడతను తర్వాత.

ఆమె అదోరకంగా అతనివైపు చూసింది.

"నామీద అనుమానమా?" అడిగింది కాంతి.

"అలా అయితే పెళ్ళే చేసుకోనుగదా? అయినా నీ గతంతో నాకు పనిలేదని మరోసారి చెబుతున్నాను. నువ్ సినిమాల్లో యాక్ట్ చెయ్యకుండా వుంటే మంచిది. ఒకవేళ నువ్వు చేస్తానన్నా నాకు అభ్యంతరం లేదు. కానీ ప్రతి సినిమాకీ నా పర్మిషన్ తీసుకోవాలి. నీకు నువ్వుగా నిర్ణయాలు తీసుకోకూడదు" చెప్పాడు ఆనందన్.

ఆ రాత్రి చాలాసేపు నిద్రకు దూరమై ఆలోచనల్లో పడింది కాంతి.

"పెళ్ళి చేసుకుని పొరపాటు చేశానా?" అనుకుంది.

"నా కాళ్ళకు నేనే బంధాలు వేసుకున్నానా?" అని బాధపడింది.

ఓ వారం రోజుల తర్వాత పత్రికల వాళ్ళు ఫోన్ చేసి ఆమెకు శుభాకాంక్షలు తెలియచేశారు.

"వివాహం చేసుకుని దాంపత్య జీవితంలో స్థిరపడ్డారు కదా! మరి మీరు సినిమాల్లో నటించటం మానేస్తారా?" అని అడిగారు.

"ఇంకా నిర్ణయం తీసుకోలేదు. త్వరలోనే మిమ్మల్నందర్నీ పిలిచి నా నిర్ణయాన్ని తెలియజేస్తాను" అని బదులిచ్చింది కాంతి.

ఆ రాత్రే భర్తకు విషయం చెప్పి "వాళ్ళకి ఏం చెప్పమంటారు?" అని అడిగింది.

"నాకు ఇష్టం లేదని ముందే చెప్పాను. నీ ఆస్తంతా నా పేరున రాసి ఆ తర్వాత కావాలంటే సినిమాల్లో నటించు" అన్నాడు ఆనందన్. కాంతి దిగ్భ్రాంతిగా భర్తవైపు చూసింది.

ఆనందన్ చూపుల్లో ఎలాంటి ప్రత్యేకతా లేదు. భార్యకు ఆజ్ఞలు జారీ చేసే అతి సాధారణమైన భర్తలాగే కనిపించాడు.

"తాను అనుకున్నదేమిటి? జరుగుతున్నదేమిటి? ఇందుకేనా తాను పెళ్ళిచేసుకున్నది?"

తన స్వేచ్ఛను వదులుకుని తన లక్ష్యానికి తిలోదకాలిచ్చి చాలామంది సగటు ఆడపిల్లల్లా మొగుడి అడుగులకు మడుగులొత్తుతూ అతని ఆజ్ఞల్ని శిరోధార్యంగా భావిస్తూ వంటింటి కుందేలులాగా, పిల్లల్ని కనే యంత్రంలాగా బతకటానికేనా అతన్ని భర్తగా కట్టుకున్నది? అలా ఆలోచిస్తున్న కాంతి కళ్ళముందు అప్రయత్నంగా గతంలో జరిగిన సంఘటనలు కదిలాయి.

ఆ రోజు తన పుట్టినరోజు..

ఉదయాన్నే లేచి స్నానం చేసింది. వినాయకుని కోవెలకు వెళ్ళి అర్చన చేయించింది. తన పుట్టినరోజు సందర్భంగా పేదలకు అన్నదానం చేయించమని గుళ్ళో వెయ్యిరూపాయలు చందా కట్టింది. తాను సినీనటిగా గుర్తింపు తెచ్చుకున్నప్పటి నుంచీ ప్రతి ఏడూ పుట్టిన రోజు పండుగ వైభవంగానే జరుపుకుంటోంది. ముఖ్యంగా తనకు అవకాశాలిస్తున్న నిర్మాతల్నీ, ప్రోత్సహిస్తున్న దర్శకుల్నీ, తోటినటీనటుల్నీ, పత్రికావిలేఖరుల్నీ అందర్నీ పిలిచి సాయంత్రం పూట పార్టీ కూడా ఇస్తోంది.

ఆరోజు కూడా అక్కడి ఓ ఫైవ్‌స్టార్ హోటల్లో పార్టీ ఏర్పాటు చేసింది.

"ఇవాళ సాయంత్రం పార్టీకి ఓ ముఖ్యమైన వ్యక్తికూడా వస్తాడమ్మా" అన్నాడు తన తండ్రి.

తనకు వెంటనే ఆ మాటలోని అంతరార్థం స్ఫురించలేదు.

"ఆనందన్ అని మనకు దూరపు బంధువు. మంచి పొజిషన్‌లో వున్నాడు. నువ్వంటే అతను చాలా ఇష్టపడుతున్నాడు. వచ్చే నెలలో మీకు పెళ్ళి చేయాలనుకుంటున్నాను" మళ్ళీ వెంటనే వివరంగా చెప్పాడు తండ్రి.

ఆ క్షణం వరకూ తను పెళ్ళి గురించి ఆలోచించలేదు.

"ఇప్పుడిప్పుడే ఇండస్ట్రీలో స్థిరపడుతున్నాను. తెలుగులో కూడా మంచి వేషాలు వస్తున్నాయి. ఇలాంటి సమయంలో నేను పెళ్ళి చేసుకుని భర్త - పిల్లలు అనుకుంటే నా భవిష్యత్తు ఏం కావాలి?" అని ప్రశ్నించింది తను.

"పెళ్ళి చేసుకున్నంత మాత్రాన సినిమాలు వదులుకోవాలని ఎక్కడుంది? పైగా అతను నిన్నూ నీ యాక్టింగ్‌నీ మెచ్చుకుని మరీ కోరుకుంటున్నాడు. సినిమాలు ఎల్లకాలమూ వుండవు. జీవితాంతం తోడుగా వుండాల్సింది భర్తా పిల్లలే. కాళ్ళ దగ్గరకు వచ్చిన అవకాశం జారవిడుచుకుంటే ముందు ముందు పరిస్థితులు ఎలా వుంటాయో? అన్నీ ఆలోచించే చెప్తున్నాను. ముందు అబ్బాయిని చూడు. అతను నచ్చితేనే నీ నిర్ణయాన్ని తెలియచెయ్యి. కానీ పెళ్ళి మాత్రం ఆడదానికి జీవితావసరమని మర్చిపోకు."

అంతగా ఆయన చెప్పడంతో తాను కాదనలేకపోయింది.

"అలాగే అతను నచ్చితే పెళ్ళిచేసుకుంటాను. కానీ ఒక్క షరతు. నా సినిమా జీవితానికి అడ్డుపడకూడదు" అంది తను.

"అతనికి ఆ సంగతి నేను ఖచ్చితంగా చెప్తాను" అన్నాడు తండ్రి.

ఆ సాయంత్రం పార్టీకి ఆనందన్ వచ్చాడు. అతన్ని తండ్రి తనకు పరిచయం చేశాడు.

"మీరేం చేస్తూంటారు?" అడిగింది తను.

"లెక్చరర్ని. ఎకనామిక్స్ లెక్చరర్ని" చెప్పాడు.

అర్థశాస్త్రాన్ని చదివిన అతగాడు అర్ధాంగిని బాగా అర్థం చేసుకోగలడన్న నమ్మకం కలిగింది ఆమెకు. తన అంగీకారాన్ని తండ్రికి తెలియచేసింది. పార్టీకి హాజరైన వారికందరికీ తాను కొద్దిరోజుల్లోనే పెళ్ళి చేసుకోబోతున్న శుభవార్త చెప్పింది. తనకు కాబోయే భర్తను అందరికీ పరిచయం చేసింది. అందరూ తనకు గ్రీటింగ్స్ చెప్పారు.

పార్టీ పూర్తయిన తరువాత తను అతనితో మురుగేశన్ ఆలయానికి వెళ్ళింది. ఆ స్వామి సన్నిధిలో తన వేలినున్న ఉంగరాన్ని తీసి ఆమె వేలికి తొడిగాడు అతను.

ఆలయం నుంచి ఇద్దరూ బీచ్‌కి వెళ్ళారు.అక్కడ రాత్రి పదకొండయ్యేదాకా ఎన్నో కబుర్లు కలబోసుకున్నారు.

అప్పటినుంచీ దాదాపు ప్రతిరోజూ ఏదో ఒక సమయంలో అతను తనను కలుసుకుంటూనే వుండేవాడు.

ఇంక నాలుగురోజుల్లో పెళ్ళి ముహూర్తం.

"ఇవాళ మనిద్దరం సరదాగా గడుపుదాం" అని అతను పొద్దున్న అయిదింటికే ఫోన్ చేశాడు.

"ఇవాళ షూటింగుందే!" చెప్పింది.

"నా కోసం కేన్సిల్ చేసుకోలేవా?"

రెండు క్షణాలు ఆలోచనలో పడింది తను.

"మరేం ఫరవాలేదు. కేన్సిల్ చేసుకో. నాకు తెలుసు. నువ్వు నా మాటను కాదనవని" మళ్ళీ అతనన్నాడు.

"సరే షూటింగ్‌కి వెళ్ళి ఓ గంటలో వచ్చేస్తాను. పదింటికి కలుద్దాం" చెప్పింది తను ఒక నిర్ణయానికి వచ్చి.

అన్నట్టుగానే పదిగంటలకు అతను తనకోసం ఇంటికొచ్చి వెయిట్ చేస్తున్నాడు.

"నిన్ను అబ్బాయి షాపింగ్‌కి తీసుకెడదామని వచ్చాడమ్మా. వెళ్ళిరా" అన్నాడు తండ్రి.

ముందుగా తనను సిల్కు ఎంపోరియానికి తీసుకెళ్ళాడు.

"నా తొలి ప్రజంటేషన్‌గా ఓ చీర కొంటాను" అన్నాడు. ఎనిమిదివందలు పెట్టి చీర తీసుకున్నాడు ఆనందన్.

"ఇప్పుడు మా ఇంటికి వెడుతున్నాం" అన్నాడు కారులో కూర్చున్న తర్వాత. తను అభ్యంతరం చెప్పలేదు.

మరికాసేపట్లోనే కారు అతని ఇంటి దగ్గర ఆగింది.

"కుడికాలు ముందుగా పెట్టు" ఆమె చేయి పట్టుకుని చిరునవ్వుతో అన్నాడతను.

అంతకుముందు చాలా సినిమాల్లో తను అలాంటి సన్నివేశాల్లో నటించింది. కానీ.

ఆ క్షణం మాత్రం జీవితంలో అలాంటి సన్నివేశం నిజంగా ఎదురైనప్పుడు ఒళ్ళంతా ఎందుకో చెమటలు పోశాయి.

ఏదో సరికొత్త ప్రపంచంలో అడుగు పెడుతున్న అనుభూతికి లోనైంది తను.

ఇల్లంతా నిర్మానుష్యంగా వుంది.

"ఇంట్లో ఎవరూ లేరా?" అనుమానంగా అడిగింది.

"లేరు కనుకనే ఈరోజు సరదాగా నీతో గడపాలనుకున్నాను. మనిద్దరం హాయిగా మనసులు విప్పి మాట్లాడుకోవచ్చు" అన్నాడు.

తన ఇల్లంతా చూపించాడు. తన తండ్రి తిరుచునాపల్లిలో పనిచేస్తూంటాడనీ, తల్లిమాత్రం తనతో వుంటూ అపుడపుడూ తిరుచునాపల్లి వెళ్ళి వస్తూంటుందనీ చెప్పాడు. అంతకుముందు రోజే ఆవిడ ఊరు వెళ్ళిందనీ, పెళ్ళి ముహూర్తం నాటికి తండ్రితో వస్తుందనీ కూడా తెలియచేశాడు.

"నేనిలా చొరవ చేసి ఎవరూ లేనప్పుడు మా ఇంటికి తీసుకొచ్చానని భయపడుతున్నావా?" ప్రశ్నించాడు తర్వాత.

తనేమీ బదులు చెప్పలేదు.

"కాబోయే భర్తనికదా! ఆ మాత్రం చొరవచేస్తే తప్పులేదేమోనని తీసుకొచ్చాను" అంటూ చొరవగానే తనను కౌగిలిలోకి తీసుకున్నాడు.

తను వారించలేకపోయింది.

"కొత్తచీర కట్టుకుని చూపించవూ?" లాలనగా అడిగాడు.

తను ఆ ముచ్చట తీర్చింది. కొత్తచీర కట్టుకొచ్చి అతని పాదాలు తాకి నమస్కారం కూడా చేసింది.

"నో! నో! ఇలాంటి పద్ధతులు నాకు నచ్చవ్. నువ్వు చదువుకున్న పిల్లవి. పైగా పెద్ద సినిమాతారవి. ఇలాంటి పనులు చేయకూడదు" అంటూ తనను మరింత దగ్గరగా తీసుకుని నుదుటి మీద ముద్దుపెట్టుకున్నాడు.

తను పరవశించిపోయింది. అతను నిగ్రహించుకోలేకపోయాడు.

"చీర నలిగిపోతుంది" అతని బాహువుల్లోంచి విడిపించుకునే ప్రయత్నం చేస్తూ అంది తను.

"నా చీరకదా ఫరవాలేదు" అన్నాడు అతను అన్నాడు అతను కొంటెగా.

అతను ఆ తర్వాత ఏం చేసినా తను వారించలేకపోయింది.

"నువ్వంటే నాకు చాలా ఇష్టం. కలల్లోకి కూడా వస్తుంటావ్ తెలుసా?" అన్నాడతను తర్వాత.

"ఇవాళ పక్కలోకి వచ్చాను కదా?" రేగిపోయిన జుట్టును దువ్వి జడ అల్లుకుంటూ చెప్పింది చిరునవ్వుతో.

"నేను సినీమాల్లో నటించటం మీకు అభ్యంతరం లేదుగా?" తను అడిగింది.

"నువ్వు సినిమాల్లో నటించటం వల్లనేకదా నేను నీ ఆరాధకుకుణ్ణి అయ్యాను." అన్నాడతను.

మరి..!!??

'ఆనాడు అలా చెప్పిన మనిషి ఇపుడు ఇలా అంటున్నాడేమిటి తన ఆస్తినంతా అతని పేర రాసి ఆ తర్వాత కావాలంటే సినిమాల్లో నటించాలా?'

"అంటే... అంటే మీరు నన్ను పెళ్ళి చేసుకున్నది నా ఆస్థికోసం అన్నమాట" అంది కాంతి రోషంతో.

"ఆస్తీ ఐశ్వర్యాలపట్ల నాకెపుడూ మోజు లేదు. మనం ఉండటానికి మంచి ఇల్లుంది. మన కుటుంబం జీవించటానికి చాలినంత జీతం నాకు వస్తుంది. ఇంకా కావాలంటే ట్యూషన్స్ చెప్పుకోవచ్చు. నువ్వు కూడా చాలా సినిమాల్లో యాక్ట్ చేసి పేరూ, డబ్బూ సంపాదించుకున్నావ్. ఇక ఆ రకం జీవితానికి గుడ్‌బై చెబితే బావుంటుంది" ఆనందన్ దృఢంగా అన్నాడు.

'ముందు మీ పర్మిషన్ తీసుకుని యాక్ట్ చేయచ్చునన్నారు. నేను సినిమాల్లో నటిస్తూండటం వల్లనే నా ఆరాధుకులయ్యారన్నారు. ఇప్పుడేమో ఆ రకం జీవితానికి గుడ్‌బై చెప్పమంటున్నారు. అసలు 'ఆ రకం' అంటే మీ ఉద్దేశ్యం ఏమిటి?" వస్తున్న కోపాన్ని అణచుకుంటూ ఆవేశంగానే ప్రశ్నించింది.

"కూల్ డౌన్ ఆవేశం అనర్థాలకు దారితీస్తుంది. సినీతారల గురించి ముఖ్యంగా లేడీస్ గురించి నలుగురూ నాలుగు రకాలుగా చెప్పుకుంటూంటారు. నీ గురించి ఎవరూ అలా చెప్పుకోవటం నేను భరించలేను. అందుకే నువ్ ఇక సినిమాలకై గుడ్‌బై చెపితే బావుంటుందన్న నిర్ణయానికి వచ్చాను. మా అమ్మకూడా ఆ మాటే అంది" చెప్పాడతను. కాంతి అతనివైపు నిర్జీవంగా చూసింది.

ఎన్నో సినిమాల్లో ధైర్యసాహసాలుగల యువతిగా నటించిన కాంతి ఆ క్షణంలో అబలగా, బేలగా మారిపోయింది.

పెళ్ళయిన తర్వాత ఆమె జీవితంలో తొమ్మిదోరాత్రి.

భర్త బాహువుల్లో బందీగా పరవశించవలసిన కాంతి, భవిష్యత్తుని తల్చుకుని భయంతో వణికిపోయింది. ఆ రాత్రి నిద్రపట్టకుండానే తెల్లవారిపోయింది.

తెల్లవారిన తర్వాత ఆమె ఒక నిర్ణయానికి వచ్చింది. పత్రికల వారికందరికీ ఫోన్ చేసి ఆ సాయంత్రం ప్రెస్ కాన్ఫరెన్స్‌కి ఆహ్వానించింది.

"మావారు చదువుకున్నవారు, సంస్కారవంతులు. నేనంటే ఆయనకు ప్రాణం. నేను సినిమాల్లో నటిస్తే ఆయనకు ఎలాంటి అభ్యంతరం వుండదన్నారు" అని ప్రకటించింది.

మర్నాడు పేపర్లలో వచ్చిన ఆ వార్త చదివి ఆనందన్ మండిపడ్డాడు.

"నా మాట కాదని సినిమాల్లో నటిస్తే విడాకులిస్తాను" అన్నాడు అక్కడితో అతను ఊరుకోలేదు.

"నేను నా భార్యకు సినిమాల్లో నటించటానికి అంగీకారం తెల్పలేదు." అంటూ పత్రికలవాళ్ళకు తెలియచేశాడు.

పత్రికలవారికీ, పరిశ్రమలవారికీ ఇదో చర్చనీయాంశంగా మారింది. ఆ పరిస్థితుల్లో కాంతికి సినిమా అవకాశాలు కూడా తగ్గిపోయాయి. మానసికంగా ఆమె క్రుంగిపోయింది.

"మావారు మా మంచివారు. నా జీవితాన్ని ఎలా కావాలంటే అలా మలుచుకోమంటున్నారు. 'ఆల్ దట్ క్రెడిట్ గోస్ టు మైహస్బండ్'" అంటూ స్టేట్‌మెంట్లిచ్చిన కాంతి సిగ్గుతో, అవమానభారంతో తలవంచుకుంది.

ఆ అవమానాలు భరిస్తూ తాళికట్టిన భర్తను గౌరవించటానికి ప్రయత్నిస్తూ కాలం గడుపుతోంది. కానీ బీటలువారిన అద్దాన్ని అతికించటం ఎవరి తరం? కలతలు రేగిన కాపురం కూడా బీటలు వారిన అద్దంలాంటిదే.

సంసారం అనే నాణేనికి 'పెళ్ళి - ప్రేమా' అనేవి బొమ్మా బొరుసులు. ఈ రెండూ పటిష్టంగా వుంటే ఆ సంసారం హాయిగా వుంటుంది. ఆ వివాహబంధం స్థిరంగా వుంటుంది. లేదంటే ఆ బతుకు చెల్లని రూపాయిలా చెదిరిపోతుంది.

ఏ భార్యకయినా సినీతారకయినా.

మొగుడిచ్చే డబ్బు కాదు ముఖ్యం.

మనసిచ్చే మొగుడు దొరకటం ముఖ్యం

ఎవరు ఏ వృత్తిలో వున్నా, భార్యాభర్తలన్నాక ఒకరినొకరు అర్థం చేసుకుని ఒకరిమీద మరొకరు గౌరవాన్ని వుంచుకుని, నమ్మకాన్ని పెంచుకోవటం అన్నింటికంటే ముఖ్యం.

***(వచ్చేనెల మరో కథనం)***

*(పాతికేళ్ళ క్రిందట సితారలో ధారావాహికగా వచ్చిన ఈ కథనాలు*

*రచయిత ప్రత్యేక అనుమతితో పునర్ముద్రణ)*